

# మహా మానవవాది ఎమ్.ఎన్.రాయ్

## - నరిసెట్టి ఇన్నయ్య




(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

-14-

## జైలు నుండి తత్త్వవేత్తగా ఆవిర్భవించిన ఎమ్.ఎన్.రాయ్


ఐదున్నర సంవత్సరాల జైలు జీవితం గడిపిన ఎమ్.ఎన్.రాయ్ ఒకవైపున సాధారణ ఖైదీగా బాధలు పడుతూనే మూడు ప్రాంతాలలో బదిలీ అయి ఒక పిల్లిని కూడా పెంచి విచిత్ర జీవితం గడిపాడు. అయితే జైలు జీవితం అత్యంత విలువైనదిగా ప్రయోజనాత్మకంగా మార్చటం ఎమ్.ఎన్.రాయ్ విశిష్టత. జైలునుండే అనేక ఉత్తరాలు తనకు కాబోయే భార్య ఎలెన్ ద్వారా వివిధ సైంటిస్టులకు పంపగలిగాడు. తాను రాస్తున్న పుస్తకానికి వారి నుండి వచ్చే సమాధానాలు ఎంతో ఉపయోగపడతాయని భావించాడు. సమకాలీన సైంటిస్ట్ ల రచనలు తెప్పించుకోగలిగాడు. ఇదంతా అత్యంత ప్రయాసతోకూడిన కార్యక్రమమైనా ఆయన పట్టుదలకు నిదర్శనంగా కనిపిస్తుంది. ప్రకృతి, జీవనం, చరిత్ర గురించిన వైజ్ఞానిక దృక్పథం తను రాయబోయే పుస్తకానికి శీర్షిక ఎంచుకున్నాడు. ఎడింగ్టన్, జీన్స్, రూథర్ ఫర్డ్, ఫికరింగ్ రచనలు కావాలని తెప్పించుకోగలిగాడు. జె.బి.ఎస్.హాల్డేన్, జూలియన్ హక్సలీ, సమకాలీన రచనలు కూడా సమకూర్చుకున్నాడు. తను రాసే లోతైన తాత్విక, శాస్త్రీయ పరిశీలనకు గాను రాయ్ డబ్ల్యు సెల్లర్స్, ఐన్ స్టయిన్, హైజన్ బర్గ్, నిల్ బోర్, డిబ్రాలీ, వైట్ హెడ్, బెట్రాండ్ రస్సెల్, ష్రోడింగర్, డిరాక్ వంటి సైంటిస్ట్ ల సమకాలీన రచనలు తెప్పించుకుని పరిశీలించాడు. సాపేక్షతా సిద్ధాంతం, క్వాంటమ్ సిద్ధాంతం బాగా లోతుగా పరిశీలించాడు. అమెరికన్ ఫిజికల్ సొసైటీ వారి రెవ్యూ తెప్పించుకుని ఐన్ స్టయిన్ సాపేక్షతా సిద్ధాంతాలను గమనిస్తూ పోయాడు. ఆధునిక విజ్ఞాన శాస్త్రపు తాత్విక ఫలితాలను సమగ్రంగా పరిశీలించటమే రాయ్ ధ్యేయం. ఇది కేవలం మార్క్సిస్ట్ దృక్పథంతోకాక అత్యంత ఆధునిక వైజ్ఞానిక పురోగమనాన్ని దృష్టిలో పెట్టుకుని రాయటం ప్రారంభించాడు. అయితే మార్క్సిస్ట్ ధోరణుల నుండి క్రమేణా బయటపడుతూ నిష్పక్షపాత శాస్త్రీయ ధోరణిని అవలంబించాడన్నమాట.




ఆధునిక భౌతిక శాస్త్రం ఎలా సాగిపోతున్నది, జీవిత గమనంలో మార్మిక దశలు అధిగమించి నిజానిజాలు బయటపెడుతున్న తీరు విజ్ఞాన సంబంధమైన విషయాలలో సైన్స్ ఏమి చెబుతున్నది... ఆధునిక భౌతిక శాస్త్రం పరిశోధిస్తున్న తీరు రాయ్ గమనిస్తూ పోయాడు. కార్యకారణ సంబంధాలను ఎంతో లోతుగా సైన్సు ఆధారంగా అధ్యయనం చేశారు. ప్రతిదానికీ కారణం వుండాలని అనుకుంటే అదేంటో పరిశీలించటం సైన్సు నిత్యనూతనంగా చేస్తున్న పని. ఇలా ప్రతి దానికీ కారణం వుండాలని అంటేనే ప్రకృతికి కారణం దైవం అని మత శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు. అంతవరకు బాగానే వుంది. అంటే కార్యకారణ సంబంధాలు ఒప్పుకుని పయనించారన్నమాట. అయనప్పుడు ప్రకృతికి కారణం ఏమిటి అంటే దైవం అన్నారు. నమ్మకస్థులకు అది తృప్తిగానే వుంది. రాయ్ దీనిని ప్రస్తావిస్తూ కార్యకారణ సంబంధం ఒప్పుకుంటే దైవానికి కారణం ఏమిటి అని

ప్రశ్నించాడు. నమ్మకస్థులు అంతటితో ఆగిపోయారు. సైంటిస్టులు ఆగిపోలేరు కదా! ఈ విషయమై ఎమ్.ఎన్.రాయ్ లోతుపాతులతో చర్చచేశారు. దైవం సర్వజ్ఞం అయితే ఆ లక్షణమే ప్రకృతికి ఎందుకు వుండకూడదు అని రాయ్ అడిగాడు. దానికి మతస్థులు సమాధానం చెప్పలేదు. మొత్తం మీద నిరంతరం సాగే ఈ సైంటిఫిక్ చర్చ రాయ్ జైలు నుండి పరిశీలించటం గమనార్హం.

జైలులో రాసిన ఐదువేల పేజీల శాస్త్రీయ పరిశీలనలు ఇంకా అచ్చుకావలసి వున్నది. కొన్ని రచనలు మాత్రం చిన్నపుస్తకాలుగా వెలువరించారు. అందులో మెటీరియలిజం, సైన్స్ అండ్ ఫిలాసఫీ పేర్కొనదగినది.




ఎ.బి.షా ఈ రచనలు చదివి ఆధునిక పరిశోధనల తిరోగమనం దృష్ట్యా ఇందులో మార్పులు చేర్పులు చేయవలసి వున్నదన్నారు. నా కోరికపై రాయ్ రచనలు నాకు పంపించారు. అందులో చాలా ఆశ్చర్యకరమైన పురోగతి వున్నది. వాటిని ఎడిట్ చెయ్యటం, ప్రచురించటం, ఆధునిక శాస్త్రాల దృష్ట్యా సరిదిద్దటం పెద్దపని. అదింకా జరగవలసి వున్నది. కానీ జైలులో వుండి చక్కటి మార్గాన్ని చూపిన రాయ్ విశిష్ఠకృషి చేశారు. ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ పరిశోధనాలయంలో రాయ్ రచనలు వుంచారు. భవిష్యత్తులో ఈ కృషిని ఎవరైనా చేపట్టవలసి వున్నది. జైలు జీవితం దుర్భరంగా వున్నా మానసికంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో రాయ్ కృషి అభినందనీయం. ఉత్తరోత్తరా రాయ్ రచనల నుండి కొన్ని వ్యాసాలు ప్రామాణిక పత్రికలలో వెలువడ్డాయి. రాడికల్ హ్యూమనిస్ట్, క్వెస్ట్ పత్రికలు ఇందుకు పేర్కొనదగినవి. సైన్స్ అండ్ ఫిలాసఫీ అనే పుస్తకం రాయ్ ఏ ధోరణిలో పరిశోధన చేశాడో తెలియపరుస్తుంది.

ఎమ్.ఎన్.రాయ్ వినూత్నమైన కొత్త విషయాలు చెబుతూ వైజ్ఞానిక దృక్పథంలో అనుసరించవలసిన రీతులు పేర్కొన్నాడు. సైంటిస్టులు సాధారణంగా ఒక్కొక్క పరిధిలో నైపుణ్యాన్ని సంపాదించి ప్రపంచానికి వెలుగునిస్తారు. ఒకరు ఫిజిక్స్ లో నిష్ణాతులైతే మరొకరు బయాలజీలో ప్రపంచానికి కొత్తవిషయాలు చెబుతారు. ఇంకొకరు కెమిస్ట్రీలో నోబెల్ ప్రైజ్ పొందేరీతిలో ప్రజోపయోగకరంగా కొత్త సంగతులు బయటపెడతారు. ఈవిధంగా వివిధ విషయాలు వేటికవే గొప్ప సత్యాలను వెలిబుచ్చుతాయి. అయితే ఒక రంగంలో ఉన్నత స్థాయికి పోయిన సైంటిస్టు మిగిలిన విషయాలలో సాధారణ వ్యక్తికంటే తక్కువ స్థాయిలోనే వుండచ్చు. కనుక వారిలో మూఢనమ్మకాలు రావటానికి అది ఒక కారణం అవుతున్నది. ఉదాహరణకు గురుత్వాకర్షణ గురించి చెప్పిన న్యూటన్ మిగిలిన రంగాలలో బొత్తిగా ప్రవేశం లేక సాధారణ మానవుడికంటే అధ్వాన్నంగా నమ్మకాలు పెంపొందించుకున్నాడు. ఎడిసన్ వంటివారు వందలాది పేటెంట్ హక్కులు సంపాదించగా మరికొన్ని రంగాలలో అత్యంత హీనమైన చాదస్తాలకు పోయారు. ఈ లోపం చాలామంది సైంటిస్టులలో ఉన్నది. ఇది పరిష్కరించాలంటే వివిధ శాస్త్ర విభాగాలలో అత్యంత అధునాతనంగా జరుగుతున్న విషయాల సారాంశాలు స్థూలంగా తెలుసుకోవటం అవసరం. అందుకే శాస్త్రాల ఫలితాల సమన్వయం క్రోడీకరించి చెప్పాలి. అప్పుడు నిపుణుడు తన పరిధిలోనే కాక ఇతర రంగాలలో నిత్యనూతనంగా ఎలా పురోగమిస్తున్నదో తెలుసుకుంటారు. దీనినే ఫిలాసఫీ ఆఫ్ సైన్స్ అంటారు. రాయ్ ఆధునిక విజ్ఞానశాస్త్రాల తాత్త్విక ఫలితాలని రాశాడు. ఈ ధోరణి అపూర్వం. ఇది అనుసరిస్తే శాస్త్రజ్ఞులలో మూఢనమ్మకాలు తగ్గుతాయి.


AB Shah

జైలులో ఐదువేల పేజీలు రాసిన ఎమ్.ఎన్.రాయ్ ఈ సిద్ధాంతాలను చాలా వివరంగా పేర్కొన్నాడు. తనకు అందుబాటులో వున్నంతవరకు విషయ చర్చ చేశాడు. జైలు నుండి బయటికి వచ్చిన

తరువాత రాజకీయరంగంలో నిర్విరామంగా నిమగ్నుడై జైలు కృషిని కొనసాగించలేకపోయాడు. అమృతలాల్ భిక్కు షా ఈ విషయం కొంతవరకు పట్టించుకున్నా ఆయన కూడా త్వరగానే చనిపోవటం వల్ల ఆ బృహత్తర ప్రయత్నం కొనసాగలేదు. విదేశాలలో రాయ్ చెప్పిన మార్గంలో ఫిలాసఫీ ఆఫ్ సైన్స్ ముందుకు సాగిపోతూ వుంది. ఇండియాలో రాయ్ రచన పరిష్కరించి ప్రచురించాల్సిన బాధ్యత సైంటిఫిక్ సంస్థ ఏదైనా చేపట్టి పూర్తి చేయాలి.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS